పకడ్బందీగా
చెక్‌పోస్టుల నిర్వహణ
● ఎన్నికల్లో మద్యం, డబ్బు సరఫరాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు
● సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్
7వ



సంగారెడ్డిలో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి పీయూష్ గోయల్

దేశ ప్రజలకు మోదీయే గ్యారంటీ

● కేంద్రమంత్రి పీయూష్ గోయల్

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 22 : దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీయే గ్యారెంటీ అని, ఇదే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరికి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆయనవెంట కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, నాయకుడు బస్వరాజపాటిల్ ఉన్నారు. అంతకు ముందు పట్టణంలోని ఐటీఐ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీఎస్ఆర్ గార్డెన్‌లో కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. కేంద్రమంత్రి పీయూష్‌గోయల్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ గత పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయాలను ఇంటింటికి వివరిస్తూ ఓట్లు వేయించాలని కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని నిర్దేశించారు. అనంతరం బీబీపాటిల్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలో ఉంటేనే దేశం సురక్షితంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు యెండల లక్ష్మీనారాయణ, విజయపాల్‌రెడ్డి, నాయకులు సంగప్ప, చీకోటి ప్రవీణ్‌తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల ప్రచార షెడ్యూల్ విడుదల



పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లోని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు క్యాంప్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, నాయకుల సమావేశంలో ఎన్నికల ప్రచార షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే టి. జగ్గారెడ్డి -పటాన్‌చెరు

నాలుగో రోజు 14 నామినేషన్లు

మెదక్ అర్బన్/సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మెదక్, జహీరాబాద్ నియోజకవర్గాలకు నాలుగోరోజు సోమవారం 14 నామినేషన్లు దాఖలయ్యాయి. మెదక్ నియోజకర్గానికి ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. తుపాకుల మురళీకాంత్ (తెలంగాణ రాజ్య సమితి), డి.శ్రీశైలం (స్వతంత్ర), తుమ్మలపల్లి పృథ్వీరాజ్ (స్వతంత్ర), వరికోలు శ్రీనివాస్ (స్వతంత్ర), ఎడ్ల రవికుమార్ (స్వతంత్ర), కె.లక్ష్మీనారాయణ (స్వతంత్ర), మైసాగారి సునీల్ (ఇండియా ప్రజాబంధు పార్టీ) నామినేషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. నాలుగు రోజుల్లో ఇప్పటి వరకు 24 నామినేషన్లు దాఖలైనట్లు ఆయన వెల్లడించారు.

జహీరాబాద్ నియోజకవర్గానికి ఏడు నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. బీబీ పాటిల్ (బీజేపీ), సురేష్ కుమార్ షెట్కార్ (కాంగ్రెస్), కొత్తబలిజ బస్వరాజ్ (తెలంగాణ ప్రజా శక్తి పార్టీ), ఎం.మోహన్‌రెడ్డి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), స్వతంత్ర అభ్యర్థులుగా రమేష్, రవిమహదేవ్ స్వామి, గంగారాములు నామినేషన్లు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.

అభ్యర్థులకు సవాల్

లోక్‌సభ ఎన్నికల ప్రచారం క్రమంగా ఊపందుకుంటోంది. నామినేషన్ల సమర్పణకు ఈనెల 25 వరకు గడువు ఉంది. 29న ఉపసంహరణ ఘట్టం ముగియగానే ప్రచారపర్వం మరింత పుంజుకుంటుంది. ఇప్పటికైతే ప్రచారానికి కేవలం 19 రోజులు మాత్రమే మిగిలింది. మే 13న పోలింగ్ జరుగుతున్న దృష్ట్యా ఒకరోజు ముందుగా అంటే మే 11న ప్రచార కార్యక్రమాలు ముగించాలి. ఈ కాస్త సమయంలో గ్రామగ్రామాన పర్యటించడం అభ్యర్థులకు సవాల్‌గా మారనున్నది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 22



ప్రచారానికి 19 రోజులే సమయం

● మండల కేంద్రాలు, పట్టణాలకే పరిమితం
● సభలు, రోడ్‌షోల్లో గళమెత్తుతున్న వైనం
● క్షేత్రస్థాయిలో కానరాని ప్రచారం ● దడ పుట్టిస్తున్న మండుటెండలు

మెదక్ లోక్‌సభ పరిధిలోని 7 నియోజకవర్గాలకు సంబంధించి 49 మండలాలు, 920 గ్రామపంచాయతీలు, 12 మున్సిపాలిటీలు, 3 జీహెచ్ఎంసీ డివిజన్లు ఉన్నాయి. అదే విధంగా 18,12,858 మంది ఓటు హక్కు వినియోగించుకోవడానికి 2,124 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

సభలు, రోడ్‌షోలపై ఫోకస్

ప్రధాన పార్టీల అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ఇప్పటివరకైతే ప్రచారానికి దిగలేదు. ఇంకా సమయం తక్కువగా ఉండడంతో పట్టణాలు, మండలాల వారీగానే ప్రజలతో సమావేశమయ్యే అవకాశాలు ఉన్నాయి. అభ్యర్థులుగా ఖరారైనప్పటి నుండే బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రధానంగా తమ పార్టీ శ్రేణులతో సమావేశాలకే ప్రాధాన్యత ఇచ్చారు. నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి తమ వాణిని వినిపించారు. సంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభకు హాజరుకాగా.. ఇటీవల మెదక్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోడ్‌షో నిర్వహించారు. ఈనెల 25న సిద్దిపేట బీజేపీ తరఫున అమిత్‌షా సభ జరగబోతుంది. ఇవే కాకుండా అభ్యర్థులు, వారితోపాటు ఇతర ప్రాంతాల ముఖ్యనేతలు, మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటా వెళ్లి ప్రచారం నిర్వహించేంత సమయం లేకపోవడంతో ఎక్కడికక్కడ జనసమీకరణ చేసి రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు, సమావేశాలు చేపడుతున్నారు. మెదక్ లోక్‌సభ పరిధిలో మరోసారి కేసీఆర్ సభ, రాహుల్ లేదా ప్రియాంక సభ, ప్రధాని మోదీతో బహిరంగ సభ జరిగేలా ఆయా పార్టీల అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు.

ఎండతో అభ్యర్థుల పరేషాన్..

మండుటెండల్లో లోక్‌సభ ఎన్నికలు జరగడం అభ్యర్థులకు తలనొప్పిగా మారింది. సాధారణంగా ఉదయం 10 గంటల తర్వాతనే సభలు, సమావేశాలు, రోడ్‌షోలు, ఇతర ప్రచార కార్యక్రమాలకు స్పందన కనిపిస్తుంటుంది. కానీ ఉదయం 9గంటలకే ఎండలు భగ్గుమంటున్నాయి. మెదక్ లోక్‌సభ పరిధి మొత్తం ఆరెంజ్ అలర్ట్ జోన్‌లో ఉంది. ఇటీవల సిద్దిపేట జిల్లాలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం ఒకింత ఆందోళనను కలిగించింది. ఈ క్రమంలో అభ్యర్థుల సమావేశాలకు జనసమీకరణ కష్టమవుతోంది. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే ప్రచారం చేస్తున్నారు. ఆ తర్వాత అంతర్గత సమావేశాలు, చర్చలు జరుపుతున్నారు. మళ్లీ సాయంత్రం 5 గంటల తర్వాతనే కాలు బయటపెడుతున్నారు. దీంతో వారి ప్రచార ప్రణాళిక సైతం తలకిందులవుతోంది. మిగిలిన సమయంలో అన్ని గ్రామాల్లో పర్యటించడం సవాల్‌గానే మారిందని అంటున్నారు. ఒక గ్రామానికి వెళ్లి మరో గ్రామానికి వెళ్లకున్నా ప్రతికూల పరిస్థితి ఎదురవుతుందని మండల కేంద్రాలు, పట్టణాలకే పరిమితమవు తున్నారు. అయితే కొన్ని ప్రభావం చూపించే గ్రామాలు, మేజర్ గ్రామాలకు మాత్రం అభ్యర్థులు ప్రాధాన్యతనిచ్చి ప్రచారం చేస్తున్నారు. లేదంటే ఆయా ప్రాంతాలకు చెందిన ముఖ్యనేతలను ప్రచారంలో దింపుతున్నారు.

నియోజకవర్గం	గ్రామాలు
సిద్దిపేట	88
మెదక్	150
నర్సాపూర్	212
సంగారెడ్డి	86
పటాన్‌చెరు	55
దుబ్బాక	150
గజ్వేల్	179
మొత్తం	**920**

జీహెచ్ఎంసీ డివిజన్లు

1. పటాన్‌చెరు
2. రామచంద్రాపురం
3. భారతీనగర్

మున్సిపాలిటీలు

1. సిద్దిపేట
2. గజ్వేల్-ప్రజ్ఞాపూర్
3. తూప్రాన్
4. దుబ్బాక
5. మెదక్
6. నర్సాపూర్
7. సంగారెడ్డి
8. సదాశివపేట
9. అమీన్‌పూర్
10. బొల్లారం
11. తెల్లాపూర్
12. రామాయంపేట

ప్రచార రథాలు, సోషల్‌మీడియాపై దృష్టి..

ప్రచారానికి తక్కువ సమయం ఉండడంతో అభ్యర్థులు ప్రధానంగా సోషల్ మీడియాపై ఆధారపడుతున్నారు. తమ ప్రచార వీడియోలు, ఫొటోలను క్షణాల్లో వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో షేర్ చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా వ్యక్తులను ఏర్పాటు చేసుకున్నారు. తమ హామీలతోపాటు ప్రత్యర్థుల లోపాలను ఎత్తి చూపుతూ వీడియోలు, పోస్టులను సోషల్ మీడియా ద్వారా చేరవేస్తున్నారు. చెవులు హోరెత్తేలా ప్రచార రథాలను సిద్ధం చేసి క్షేత్రస్థాయిలో తిప్పుతున్నారు. తమపై వ్యక్తిగతంగా రాసిన పాటలతో పాటు ఆయా పార్టీలకు సంబంధించిన పాటలు, సందేశాలను వినిపిస్తూ ఈ ప్రచార రథాలు ఊరూరా చక్కర్లు కొడుతున్నాయి. ఆయా గ్రామాల రచ్చబండల వద్ద కళాబృందాల ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. అభ్యర్థుల ముఖాలను ప్రత్యక్షంగా ఎరుగకున్నా ఇలాంటి ప్రచారాల ద్వారా మాత్రం ప్రజలకు ఎంతో కొంత అవగాహన కలుగుతోంది.

గాలివాన బీభత్సం..

● పగలంతా ఎండ.. సాయంత్రానికి గాలివాన ● తడిసిన ధాన్యం, జొన్నలు ● పిడుగుపాటుకు ఒకరి మృతి



మాసాన్‌పల్లిలో పిడుగుపాటుకు మృతిచెందిన గొర్రెల కాపరి కర్వ రేణుక



మాసాన్‌పల్లి శివారులో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం



తూప్రాన్‌లో కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యం

నారాయణఖేడ్/కల్హేర్/చిన్నశంకరంపేట/రామాయంపేట/వెల్దుర్తి, ఏప్రిల్ 22: గాలివాన బీభత్సం సృష్టించింది. నారాయణఖేడ్ డివిజన్‌లో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ, సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురిసింది. పలు చోట్ల ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. చేతికి వచ్చిన జొన్న పంటకు నష్టం వాటిల్లింది. మామిడికాయలు నేలరాలాయి.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

కల్హేర్ మండలంలోని మాసాన్‌పల్లిలో పిడుగు పాటుకు గుర్రై కర్వ రేణుక(30) అనే మహిళా గొర్రెల కాపరి మరణించింది. ఆమె భర్త కర్వ పెద్ద మల్లేశం, మరో కాపరి వల్లూరి యాదయ్య తృటిలో బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం, ఈదురు గాలులు రావడంతో గ్రామ శివారులోని వాగు సమీపంలో గొర్రెలు, మేకలు మేపుతున్న కర్వ పెద్ద మల్లేశం, రేణుక, యాదయ్య చెట్టు కింద నిల్చున్నారు. ఇంతలోనే పెద్దశబ్ధంతో పిడుగు పడటంతో రేణుక అక్కడికక్కడే మరణించింది. పక్కనే ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలు రేణుకకు 8, 5 సంవత్సరాల ఇద్దరు పిల్లలతో పాటు రెండేళ్ల వయస్సున్న ఇద్దరు కవల పిల్లలున్నారు. కల్హేర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెదక్ జిల్లాలో..

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఈదురుగాలు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం తడిసి పోయింది. మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చిన్నశంకరంపేట, రామాయంపేట మండలాల్లోనూ సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వచేసిన, రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసింది.

మాట తప్పిన కాంగ్రెస్‌కు ఎన్నికల్లో ఓటమి తప్పదు

● మాజీ మంత్రి హరీశ్‌రావు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డిటౌన్, ఏప్రిల్ 22 : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మాట తప్పిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తప్పదని బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్లేపల్లిలో సోమవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యానికి రూ.500 బోనస్, ఆసరా పెన్షన్ పెంపు, మహిళలకు రూ.2,500, కల్యాణలక్ష్మికి అదనంగా తులం బంగారం, నిరుద్యోగ భృతి ఏమయ్యాయని ప్రశ్నించారు. నాలుగున్నర నెలల్లోనే ఏదో చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమకు ఓటేయకపోతే సంక్షేమ పథకాలు బంద్ అవుతాయని ప్రజలను భయపెడుతున్నారని మండిపడ్డారు. మెడలో పేగులు వేసుకుంటా, మానవబాంబునై పేలుతా, డ్రాయర్ ఊడగొడతా అని రేవంత్‌రెడ్డి మాట్లాడే భాష సీఎం పదవి గౌరవాన్ని కించపరిచేలా ఉందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్, మెదక్ నియోజకవర్గాల అభ్యర్థులు గాలి అనిల్‌కుమార్, వెంకట్రాంరెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి, నాయకుడు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యాచరణ రూపొందించింది. పాఠశాలల్లో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలన్నింటినీ 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'లకు సర్కారు అప్పగించింది. గత ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమాన్ని చేపట్టి పాఠశాలలను ఎంపిక చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన విషయం తెలిసిందే. వాటిలో కొన్ని పనులు పూర్తికాగా, చాలా పెండింగ్‌లో ఉన్నాయి. రెండేళ్లుగా మన ఊరు-మన బడి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత సర్కారు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేసింది. స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో పాఠశాలలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

-సంగారెడ్డి అర్బన్

అద్దంలా బడులు..

తిరిగి తెరిచే నాటికి అందుబాటులోకి అన్ని వసతులు

విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పూర్తిచేయడమే లక్ష్యం
'అమ్మ' కమిటీలకు నిర్మాణ బాధ్యతలు
సంగారెడ్డి జిల్లాలో 763 పాఠశాలలకు మహర్దశ

రెండు నెలల్లో పూర్తిచేయడానికి ప్రణాళిక

ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, తరగతి గదులు, మరుగుదొడ్ల మరమ్మతులు, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం తదితర పనులు చేపట్టనున్నారు. ఈ పనులన్నీ పాఠశాలల పునఃప్రారంభం నాటికి పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు విద్యాశాఖ వర్గాలు పేర్కొన్నాయి. పనులు జరిగే పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

సంగారెడ్డి జిల్లాకు రూ.27 కోట్లు

సంగారెడ్డి జిల్లాలో 763 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాల కింద అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.27 కోట్ల నిధులు కేటాయించింది. పాఠశాలల్లో చేపట్టే వివిధ నిర్మాణ బాధ్యతలను పబ్లిక్ హెల్త్, పంచాయతీరాజ్, టీఎస్ఈడబ్ల్యుఐడీసీ, ఇరిగేషన్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్లకు అప్పగించింది. ఇప్పటికే ఆయా ఇంజనీరింగ్ విభాగాలు చేపట్టాల్సిన పనులను గ్రౌండింగ్ చేస్తుండగా, మరికొన్నిచోట్ల పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. 25 శాతం నిధులను అడ్వాన్స్‌గా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల వద్ద జమ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ పనులన్నీ పూర్తయితే సర్కారు పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.



కోహీర్‌లో పాఠశాలలో టాయిలెట్స్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు



కంది మండలం మక్త అల్లూరు పాఠశాలలో కొనసాగుతున్న నిర్మాణ పనులు



గుంపులుగా ఉన్న పందులు

జహీరాబాద్ పట్టణంలోని ఆర్యనగర్, గడి, మాణిక్‌ప్రభు మహేశ్వరీతోపాటు పలు వీధుల్లో పందులు గుంపులుగా సంచరిస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఇళ్లలోకి చొరబడి దాడులు చేస్తున్నాయని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పందులను కట్టడి చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- జహీరాబాద్

భవానమ్మపల్లిలో కొనసాగుతున్న భవానీమాత ఉత్సవాలు

జహీరాబాద్, ఏప్రిల్ 22: మొగుడంపల్లి మండలంలోని భవానమ్మపల్లిలో భవానీమాత జాతర సోమవారం ప్రారంభమైంది. 500 ఏళ్ల కిత్రం చత్రపతి శివాజీ మహారాజ్ యుద్ధానికి వెళ్లేముందు భవానమ్మపల్లి(ఖాంజామాల్‌పూర్)లో సేదతీరాడనే చరిత్రను గ్రామస్థులు ఇప్పటికీ చెప్పుకుంటారు. అప్పట్లో యుద్ధంలో విజయం సాధిస్తే భవానమ్మ ఆలయాన్ని నిర్మిస్తానని మొక్కుకున్నాడని, విజయం సాధించాక ఆలయాన్ని నిర్మించాడని గ్రామస్థులు తెలిపారు. అప్పటి నుంచి నేటివరకూ ప్రతియేటా జాతరను నిర్వహిస్తారని ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు వివరించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణం, 23న సామూహిక భోజనాలు, 24న అమ్మవారికి పల్లకీసేవ ఉంటుందన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు

కొల్చారం, ఏప్రిల్ 22: కొల్చారం మండల పరిధిలోని వరిగుంతంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా సోమవారం పోచమ్మ, దుర్గమ్మలకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పోచమ్మ, దుర్గమ్మ ఆలయాల్లో గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. బోనాలలో భాగంగా జడ్పీటీసీ మేఘమాల బోనమెత్తారు. మంగళవారం ఎల్లమ్మ, నల్ల పోచమ్మ అమ్మవార్లకు బోనాల ఊరేగింపు ఉంటుందని, 24 నుంచి 26వ తేదీవరకు పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. 27, 28వ తేదీల్లో పెద్దమ్మతల్లికి బోనాల ఊరేగింపు, బలి పెద్దమ్మతల్లికి నైవేద్య కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు ముత్యంగారి సంతోష్‌కుమార్, సొసైటీ ఛైర్మన్ చిన్నారపు ప్రభాకర్, మాజీ ఛైర్మన్ గుడాల నర్సింహులు, ముదిరాజ్ సంఘం నాయకులు రాజు పాల్గొన్నారు.



ఉత్సవాలకు ముస్తాబైన అమ్మవారి ఆలయం

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 22: పెద్దశంకరంపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం కోరం లేకపోవంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించాల్సి ఉండగా మధ్యాహ్నం 12 గంటల వరకు ఎదురు చూసినా కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు ఆమె వివరించారు.

మంజీరాను తవ్వేస్తున్నారు!





ఇసుకను తవ్వేయడంతో మంజీరా నదిలో తేలిన బండరాళ్లు

- హల్దీవాగు నుంచీ ఇసుక అక్రమ రవాణా
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీస్ అధికారులు

హల్దీవాగు నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లలో తరలిస్తున్న దృశ్యం

కొల్చారం, ఏప్రిల్ 22: రోజురోజుకూ ఇసుక మాఫియా ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపినా అడ్డగోలుగా వాగులు, వంకలు తవ్వేస్తున్నారు. అడ్డు వచ్చిన వారిపై దాడులకు సైతం వెనుకంజ వేయడం లేదు. మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని మంజీరా తీర గ్రామాలైన తుక్కాపూర్, పైతర, ఏటిగడ్డమాందాపూర్, కోనాపూర్, హల్దీవాగు తీర గ్రామాలైన కొంగోడు, నాయిన్ జలాల్‌పూర్ గ్రామాల నుంచి అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. తుక్కాపూర్, పైతర గ్రామ శివారులో మూడు మీటర్ల లోతులో నుంచి కొంతమంది అక్రమార్కులు ఇసుకను తవ్వేస్తుండడంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయని తుక్కాపూర్ గ్రామ రైతులు ఇటీవల తహసీల్దార్‌కు వినతిపత్రం సైతం అందజేశారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొంగోడు, నాయిన్ జలాల్‌పూర్ శివారులోని హల్దీవాగు నుంచి ఇసుకను కొల్చారం, కొడిపల్లి, వెల్మకన్నె, లింగంపల్లి గ్రామాల్లో ట్రాక్టర్ ఒక్కంటికి రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డొచ్చిన పోలీసులపై సైతం దాడులకు ఇసుక మాఫియా వెనుకడుగు వేయడం లేదు. ఈయేడు హల్దీవాగులో ఇసుక తవ్వకాలతో బండరాళ్లు తేలాయి. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో రైతులు సాగుచేసిన వరి పొట్ట దశకు చేరుకునే సమయంలో ఎండిపోయింది. నాయిన్ జలాల్‌పూర్ గ్రామంలో ఇసుక మాఫియాను పట్టుకునేందుకు మెదక్ టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుమలేశ్ తన సిబ్బందితో రాగా.. ఇసుక మాఫియా దాడులు చేసే ప్రయత్నం చేశాయి. ఇప్పటికైనా పోలీసు, రెవెన్యూ అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ముందట బైక్.. వెనుక ఇసుక ట్రాక్టర్

ఇసుక మాఫియా ఒక్కోసారి.. ఒక్కో పద్ధతిని పాటిస్తూ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. తుక్కాపూర్, నాయిన్ జలాల్‌పూర్ గ్రామాల్లోని వాగులో ఇసుక లోడ్ చేసుకునే వరకు మోటార్ సైకిళ్లపై ఇసుక రవాణా జరిగే రోడ్డు వెంట రెక్కీ నిర్వహిస్తారు. ఇసుక ట్రాక్టర్ బయలుదేరగానే ఒక మోటార్ సైకిల్‌కు.. ఇంకో మోటార్ సైకిల్‌కు అర కిలోమీటర్ దూరం ఉంటూ పోలీసులు వస్తున్నట్లు అనుమానం రాగానే ఫోన్ ద్వారా ఇసుక ట్రాక్టర్‌ను రోడ్డు పక్కన పొదల చాటుకు దారి మళ్లిస్తారు. లేకుంటే రోడ్డు పక్కనే అన్‌లోడ్ చేసి ఖాళీ ట్రాక్టర్‌తో ఉంటారు.

ఇసుక అక్రమ రవాణా మా దృష్టికి రాలేదు

మంజీరా నది, హల్దీవాగు నుంచి రాత్రిపూట ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నదన్న విషయం మా దృష్టికి రాలేదు. ఒకవేళ ఎవరైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటాం.

- మహ్మద్ గఫర్ మియా, తహసీల్దార్, కొల్చారం

బీజేపీతోనే దేశాభివృద్ధి

● దుబ్బాక మాజీ ఎమ్మెల్యే, బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు



దుద్దెడలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

కొండపాక, ఏప్రిల్ 22: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. కొండపాక మండలం దుద్దెడలో సోమవారం రాత్రి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రజలను మోసం చేసిందే.. తప్పా మేలు చేయలేదన్నారు. కొంతమంది చేతుల్లోనే అధికారం కేంద్రీకృతం కావడంతో ప్రజలు విసిగి వేసారి పోయారని పేర్కొన్నారు. వందరోజులకే కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏమీ చేయలేకపోతున్నదన్నారు. దేశ భద్రత, దేశాభివృద్ధిలో ప్రపంచ దేశాలు మనదేశం వైపు చూస్తున్నాయని, ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో దేశం అగ్రరాజ్యాల వరుసలో నిలిచిందని చెప్పారు. దేశ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని బీజేపీకి ఓటు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఎంపీపీ సాయిలు రాజీనామా



గజ్జెల సాయిలు

మిరుదొడ్డి, ఏప్రిల్ 22: మిరుదొడ్డి మండల పరిషత్ అధ్యక్షుడు గజ్జెల సాయిల సోమవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. పార్టీ కార్యకలాపాల్లో తనకు ప్రాధాన్యం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ పార్టీ జిల్లా అధ్యక్షుడికి లేఖ రాశారు. ఇక పార్టీలో కొనసాగలేనని స్పష్టం చేశారు.

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు

● రూ.2 వేల జరిమానా విధించిన సిద్దిపేట సెషన్స్ కోర్టు

దౌల్తాబాద్, ఏప్రిల్ 22: బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి సోమవారం సిద్దిపేట సెషన్స్ కోర్టు పదేళ్ల జైలు, రూ. 2 వేల జరిమానా విధించింది. దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ కేసు వివరాలను వెల్లడించారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలోని ఓ గ్రామంలోని ఫౌల్ట్రీఫాంలో ఓ బాలిక(15) పని చేస్తూ కుటుంబానికి అండగా ఉంటోంది. అదే గ్రామానికి చెందిన నిందితుడు తలారి శ్రీకాంత్(20) 2021 అక్టోబర్‌లో ఆ బాలికను కిడ్నాప్ చేయడంతో పాటు అత్యాచారం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పట్లో విధుల నిర్వర్తించిన ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు. అప్పటి తొగుట సీఐ రవీందర్ జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపగా, తొగుట సీఐ కమలాకర్ సిద్దిపేట కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారించిన జిల్లా సెషన్ కోర్టు ఫస్ట్ అడిషనల్ జడ్జి నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 2వేల జరిమానా విధించారు. ఈ కేసు విచారణలో కీలక పాత్ర పోషించిన తొగుట సీఐ కమలాకర్, కోర్టు కానిస్టేబుళ్ల లావణ్య, బాస్కర్, రఘు, కోర్టు లైనింగ్ హెడ్ కానిస్టేబుల్ రాజమల్లు లను జిల్లా సీపీ అనురాధ అభినందించారు.

విద్యుదాఘాతంతో కాంట్రాక్ట్ కూలి మృతి



మహేష్(ఫైల్)

రేగోడు, ఏప్రిల్ 22: విద్యుదాఘాతంతో కాంట్రాక్ట్ కూలి మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన రేగోడులో సోమవారం చోటు చేసుకున్నది. పాపన్నపేట మండలం మల్లంపేట గ్రామానికి చెందిన బోయిని మహేష్(26) మరో ఇద్దరు రేగోడు ఆస్పత్రి ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇస్తున్నారు. ఈ క్రమంలో షాక్ తగిలి స్తంభం పైనుంచి మహేష్ కిందపడిపోయాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. విద్యుదాఘాతంతోనే మృతిచెందినట్లు విద్యుత్ ఏఈ యాసిన్ తెలిపారు.

బస్సును ఢీకొట్టిన లారీ, ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన ఆర్టీసీ బస్సు

కొండపాక, ఏప్రిల్ 22: ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాలయ్యాయి. ఈ సంఘటన కొండపాక గేటు వద్ద రాజీవ్ రహదారిపై సోమవారం జరిగింది. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును కొండపాక గ్రామం నుంచి రాజీవ్ రహదారి వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. దాంతో బస్సు డ్రైవర్‌కు కాలు విరగ్గా.. ఇద్దరు ప్రయాణికులు శ్రీలత, దిలీప్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో బస్సులో ఇరుక్కుపోయిన డ్రైవర్ లక్ష్మయ్యను బయటకు తీసి చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వాహనాల తనిఖీలో రూ.2 లక్షల నగదు పట్టివేత



నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కొండపాక, ఏప్రిల్ 22: కొండపాక మండలం నాగులబండ వద్ద సోమవారం వాహనాల తనిఖీలో రూ.2 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు నాగులబండ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా సిద్దిపేటకు చెందిన సుందరయ్య తన కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.2 లక్షలను తీసుకెళ్తున్నాడు. వాటిని పోలీసులు సీజ్ చేశారు. సీఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వాహనాల తనిఖీ జరుగుతున్నదని, రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే తగిన ఆధారాలు ఉండాలన్నారు.

ఐనాపూర్ చెక్‌పోస్టు వద్ద రూ.60 వేలు...

చేర్యాల, ఏప్రిల్ 22: కొమురవెల్లి మండలం ఐనాపూర్ చెక్‌పోస్టు వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలో సోమవారం పోలీసులు రూ.60 వేల నగదు పట్టుకున్నారు. ధూళిమిట్ట మండలం తోర్నాల గ్రామానికి చెందిన ఆకుల యాదగిరి కారులో నగదు తీసుకుని వెళ్తుండగా.. చెక్‌పోస్టు వద్ద తనిఖీలో సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు పట్టుకుని సీజ్ చేశారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ సస్పెన్షన్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 22: మెదక్ రూరల్ ఎస్ఐ అమర్, కానిస్టేబుల్ బాసిత్‌పై పోలీసు అధికారులు వేటు వేశారు. ఇసుక ట్రాక్టర్ రిలీజ్ విషయంలో గతనెల 19న ఆసులపల్లికి చెందిన కందుల చంద్రం వద్ద స్టేషన్ రైటర్ సురేందర్ రూ.15వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ అధికారులు రైటర్‌ను విచారించగా ఎస్ఐ, కానిస్టేబుల్‌కు డబ్బులు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కేసులో ఏసీబీ అధికారులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారించిన అధికారులు ఎస్ఐ, కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు.

ఉద్యోగులకు న్యాయం చేయాలి

● రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈవోకు టీఎన్జీవో నేతల విజ్ఞప్తి



రామచందర్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 22: జీవో 317తో నష్టపోయిన పశుసంవర్ధకశాఖ ఉద్యోగులకు న్యాయం చేయాలని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో రామచందర్‌కు టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం సీఈవో మెదక్ వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 317 జీవోతో పశుసంవర్ధక శాఖ ఉద్యోగులకు నష్టం జరిగిందని, వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడు ఫజులొద్దీన్, సంయుక్త కార్యదర్శి శివాజీ, గోపాల్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు చైతన్య ర్యాలీ



ఖేడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దివ్యాంగులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల్లో దివ్యాంగ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం కల్పిస్తున్న సదుపాయాలను వివరిస్తూ సోమవారం ఖేడ్‌లో వివిధశాఖల అధికారులతో ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణ ప్రధాన రహదారుల గుండా కొనసాగింది. దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు కల్పిస్తున్న సదుపాయాలను వివరిస్తూ ముద్రించిన బ్యానర్ చేతపట్టుకుని ప్రతీ దివ్యాంగ ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సుజాత, మున్సిపల్ మేనేజర్ వెంకట శివయ్య, శానిటేషన్ అధికారి శ్రీనివాస్, దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారి ఇస్మాయిల్, మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మి, ఇతర బాధ్యులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి

- సురేష్‌షెట్కార్ గెలుపే ధ్యేయం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

జోగిపేట, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా, సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. సోమవారం, జోగిపేటలోని కాగ్రెస్ కార్యాలయంలో అందోలు-జోగిపేట కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికల్లో కూడా మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్‌కు భారీ ఆధిక్యం సాధించాలన్నారు. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని సూచించారు. వచ్చే 25 రోజులు ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ వందరోజుల్లో చేపట్టిన అభివృద్ధి, ఆరు గ్యారంటీ పథకాల అమలును వివరించి ఓటర్లను చైతన్యపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పరిధిలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, కార్యర్తలు పాల్గొన్నారు.

పకడ్బందీగా చెక్‌పోస్టుల నిర్వహణ

- ఎన్నికల్లో మద్యం, డబ్బు సరఫరాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు
- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్, హాజరైన పోలీసులు

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల్లో మద్యం, డబ్బు సరఫరాకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన జిల్లా నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఓటర్లను చైతన్యవంతం చేయడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పాత నేరస్థులు, గత ఎన్నికల్లో అల్లర్లు సృష్టించినవారిని ముందస్తుగా బైండోవర్ చేయాలని ఆదేశించారు. ప్రతీ పోలీసు అధికారి తమ ప్రాంతంలో పోలింగ్ రూట్ మొబైల్ గురించి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. నివాసాలు, ప్రధాన కూడళ్లలో ప్రజలు స్వచ్ఛందంగా సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకునేవిధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో డీఎస్పీలు సత్తయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎస్బీ ఇన్స్‌పెక్టర్ మల్లేశం, డీసీఆర్బీ ఇన్స్‌పెక్టర్ రమేష్, ఎన్నికల విభాగం సీఐ విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చీరాలలో శిక్షణ పొందిన మహిళా చేనేత కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ అలుగు వర్షిణి



నూలు దారం తీస్తున్న చేనేత కార్మికుడితో కమిషనర్ వర్షిణి

చేనేత రంగంలో మహిళలు రాణించాలి

● చేనేత, జౌళిశాఖ రాష్ట్ర కమిషనర్ అలుగు వర్షిణి

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 22: చేనేత ఉత్పత్తుల రంగంపై మహిళలు ఆసక్తి చూపించాలని రాష్ట్ర జౌళి, చేనేతశాఖ కమిషనర్ అలుగు వర్షిణి సూచించారు. సోమవారం సిద్దిపేటలో పర్యటించిన ఆమె చేనేత సహకార సంఘాలను సందర్శించారు. ఇటీవల సిద్దిపేటకు చెందిన 18 మంది మహిళలు చీరనేయడంపై శిక్షణ పొందేందుకు ప్రముఖ చేనేత గ్రామమైన చీరాలను సందర్శించారు. వారితో కమిషనర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారు అక్కడ నేర్చుకున్న అంశాలను, ఇంకా వారికి అవసరమైన శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. రెండోదశలో మరి కొంతమందిని ఎంపికచేసి వారికి కూడా నాణ్యమైన చేనేత ఉత్పత్తుల తయారీకి మెరుగైన శిక్షణ ఇవ్వనున్నట్లు కమిషనర్ వివరించారు. అనంతరం సిద్దిపేట ప్రత్యేక చీరలైన గొల్లభామ, రామప్ప చీరలు నేసిన కార్మికులను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వంద నెంబర్ గల నూలు వస్త్రాలను నేయాలని, చీరల తయారీలో నాణ్యత పాటించాలని సూచించారు. త్వరలోనే మహిళలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి చేనేత రంగంలో మహిళల పాత్ర పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఫ్యాషన్ టెక్నాలజీ చాంబర్ ఆఫ్ కామర్స్ చేనేత, జౌళి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చేనేత రంగాన్ని ఉత్పత్తులను పెంపొందించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, చేనేత శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ అశోక్, రతన్‌కుమార్, ఏడీ సంతోష్‌కుమార్, ఏడీఏ ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయం హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న భక్తులు

రాయికోడ్, ఏప్రిల్ 22: మండల కేంద్రమైన రాయికోడ్‌లోని భద్రకాళి సమేత వీరభద్రేశ్వర ఆలయం హుండీ సోమవారం లెక్కించారు. వెండి, బంగారు వస్తువులతో పాటు రూ.3.47 లక్షల నగదు వచ్చినట్లు అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్‌పాటిల్ మాట్లాడుతూ ఈనెల 27 నుంచి మే రెండో తేదీవరకు జాతర నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



వసతి గృహంలో మాట్లాడుతున్న కార్యదర్శి హన్మంతరావు

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 22: సంగారెడ్డిలోని ఎస్టీ గిరిజన కళాశాల బాలుర వసతి గృహంలోని విద్యార్థుల బాగోగులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె.హనుమంతరావు సూచించారు. సంగారెడ్డిలోని ఎస్టీ గిరిజన కళాశాల బాలుర వసతి గృహాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, న్యాయ పరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి


బాధితుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 22: పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలని మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి పోలీస్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. బాధితులకు త్వరగా న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో.. మూలమలుపులను మరిచారు

● ప్రమాదాలకు కేరాఫ్‌గా హైదరాబాద్-మెదక్ (765డి) జాతీయ రహదారి ● ప్రయాణించాలంటే జంకుతున్న వాహనదారులు



పెద్దచింతకుంట, నర్సాపూర్ సమీపంలో గల ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులు

నర్సాపూర్, ఏప్రిల్ 22: జాతీయ రహదారిని రూ.వందల కోట్ల వ్యయంతో విస్తరించినా మూలమలుపులు అలాగే వదిలేయడంతో వాహనదారులపాలిట ప్రమాదకరంగా పరిణమించాయి. రోజూ ఎక్కడో ఓ చోట ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోవడమో లేక శాశ్వత అంగవైకల్యానికి గురి కావడమో జరుగుతోంది. దీంతో హైదరాబాద్-మెదక్ 765డి జాతీయ రహదారిపై ప్రయాణించాలంటేనే భయపడాల్సిన దుస్థితి నెలకొన్నది. వివరాల్లోకి వెళ్తే..

ప్రమాదాలకు అడ్డాగా...

మెరుగైన రవాణాసౌకర్యం కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నర్సాపూర్ పరిధిలోని గండిమైసమ్మ సమీపంలోని రింగురోడ్డు నుంచి మెదక్ వరకు జాతీయ రహదారిగా విస్తరించారు. ఈ రోడ్డు విస్తరించక ముందు అనేక మూలమలుపులతో అత్యంత ప్రమాదకరంగా ఉండేది. రోడ్డు విస్తరణ సమయంలో వాటిని అలాగే వదిలేయడంతో ప్రస్తుతం మెదక్ జిల్లా పరిధిలో సుమారు 35కిలోమీటర్ల మేర అనేక చోట్ల, ముఖ్యంగా మూలమలుపులు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి. రోడ్డు విస్తరించడంతో వాహనాల వేగం పెరిగింది. దీంతో రోడ్డు మలుపులు ఇరుకుగా మారి ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దాదాపు నెల రోజుల క్రితం నర్సాపూర్ మండలం సీతారాంపూర్ గ్రామ సమీపంలో ఓ మహిళ రోడ్డుదాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృత్యువాత పడింది. తరచూ ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు డివైడర్ లేక ..

నర్సాపూర్ మండల పరిధిలోని గండిమైసమ్మ నుంచి గుమ్మడిదల వరకు మాత్రమే డివైడర్ ఉండగా మిగతా మెదక్ వరకు మధ్య మధ్యలో గ్రామాలు వచ్చిన చోట తప్ప డివైడర్లు లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణంగా చెబుతున్నారు. రోడ్డు విస్తరణ సమయంలో మలుపులు తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేసినా అప్పట్లో అధికారులు ఎవరూ పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా ఈ రోడ్డుపై కొండాపూర్, వ్యవసాయ పరిశోధనా కేంద్రం వై జంక్షన్, అర్బన్ పార్కు, సబ్‌స్టేషన్, సీతారాంపూర్, చిన్నచింతకుంట, పెద్దచింతకుంట, రెడ్డిపల్లి, కౌడిపల్లి మండలంలో లోతువాగు, దేవులాతండా, వెంకట్రావ్‌పేట, రాయిలాపూర్, నాగ్సన్‌పల్లి, అంతారం, మహ్మద్‌నగర్, కౌడిపల్లి, కొల్చారం మండలంలో హనుమాన్‌బండల్, కిష్టాపూర్ తదితర గ్రామాల వద్ద మలుపుల కారణంగా ప్రమాదాలు తరుచూ జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరమైన మలుపులను వీలైనంతగా తగ్గించి, అవసరమైన చోట డివైడర్లను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నాలుగు లైన్ల రోడ్డు.. మూడు లైన్ల విస్తీర్ణం

మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ ఔటర్ రింగురోడ్డు నుండి నర్సాపూర్, కౌడిపల్లి, కొల్చారం మీదుగా మెదక్ సమీపంలోని రాంపూర్ వరకు 62 కిలోమీటర్ల రోడ్డును ఐదేళ్ల క్రితం జాతీయ రహదారిగా రూ.435కోట్లతో విస్తరించారు. 17కిలోమీటర్లు మాత్రమే నాల్గు లైన్ల రోడ్డుగా ఇరువైపుల 50 అడుగుల మేర విస్తరించారు. మిగతా 45కిలోమీటర్ల మేర రోడ్డును మాత్రం అటవీప్రాంతం ఉందన్న ఉద్దేశంతో కేవలం పది మీటర్లు మాత్రమే విస్తరించారు. దీంతో పేరుకు నాలుగు లైన్ల రోడ్డుగా అయినా అత్యధిక శాతం కేవలం మూడులైన్ల రోడ్డు విస్తీర్ణం కలిగి ఉంది. అంతేకాకుండా మలుపులు కూడా అత్యధికంగా ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతంలో వేగంగా ప్రయాణించే వాహనాలవారికి ఎదురుగా వచ్చే వాహనం దగ్గరికి వచ్చే వరకు కనిపించని పరిస్థితి నెలకొన్నది. దీంతో ఈ ప్రాంతంలోనే అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయి.

అంగన్‌వాడీల్లో యాన్యువల్ డే


పిల్లలకు సర్టిఫికెట్లు, ప్రోగ్రెస్ కార్డులను అందజేస్తున్న ఉపాధ్యాయులు

మునిపల్లి, ఏప్రిల్ 22: మండలంలోని ఖమ్మంపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం యాన్యువల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్లు నిండిన పిల్లలకు పట్టా సర్టిఫికెట్లు, ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. అంతకు ముందు తల్లిదండ్రుల సమక్షంలో పిల్లలను సన్మానించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖమ్రొద్దీన్, అంగన్‌వాడీ టీచర్లు నాగలత, నాగరాణి,పుష్పలత, ఉపాధ్యాయులు వినయ్ కుమార్, గోపాల్, ప్రీతి, యువజన సంఘం నాయకుడు తుడుం రాజేందర్ పాల్గొన్నారు.

● **వెల్దుర్తి:** మండల కేంద్రమైన వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ దేవలత ఆధ్వర్యంలో సోమవారం ప్రీస్కూల్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి హాజరై మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరానికి ప్రాథమిక పాఠశాలకు వెళ్లేందుకు చిన్నారులను అంగన్‌వాడీ టీచర్లు తీర్చిదిద్దుతారన్నారు. ఏప్రిల్ మాసంలో చిన్నారుల నైపుణ్యత చూసి వారికి మార్కులు వేసి ప్రోగ్రెస్ కార్డుతో చిన్నారులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో బోర్ మోటార్‌కు మరమ్మతు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


మోటార్‌కు మరమ్మతు చేయడంతో నీటిని పట్టుకుంటున్న కాలనీవాసులు

కొల్చారం, ఏప్రిల్ 22: 'కొల్చారం ఎస్సీ కాలనీలో తాగునీటికి కటకట' అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ వద్ద ఉన్న సింగిల్ ఫేజ్ మోటార్‌తో పాటు జెండా దగ్గర ఉన్న సింగిల్ ఫేజ్ మోటార్‌కు మరమ్మతులు చేయించారు. దీంతో కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య తీరింది. మధ్యాహ్నం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సంపత్‌కుమార్, డీఈ కిషన్ వచ్చి ఎస్సీ కాలనీతో పాటు గ్రామంలో తాగునీటి సరఫరాను పరిశీలించారు. వైకుంఠ ధామం దగ్గరలో ఉన్న త్రీఫేజ్ మోటార్‌ను మరమ్మతు చేసి వాటర్‌ట్యాంకుకు కనెక్షన్ ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. వైకుంఠధామంలో విద్యుత్ కనెక్షన్ లేనందున సింగిల్‌ఫేజ్ మోటార్‌ను ఏర్పాటు చేయలేదన్నారు. ఆయన వెంట ఏఈ శ్రీకాంత్, వాటర్‌మన్, సిబ్బంది ఉన్నారు.

తలసేమియా బాధితుల కోసం మెగా రక్తదాన శిబిరం

రాయికోడ్, ఏప్రిల్ 22: తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం మండల పరిధిలోని కర్చల్ గ్రామంలో సోమవారం టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దివంగత పట్లోళ్ల దత్తురెడ్డి జ్ఞాపకార్థం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, తెలంగాణ రాష్ట్ర రక్తదాతల సమూహ అధ్యక్షుడు డాక్టర్ బాలు, తెలుగునాడు విద్యార్థి సమాఖ్య టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్రఅధ్యక్షుడు పర్లపల్లి రవీందర్ మాట్లాడుతూ చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన పట్లోళ్ల మహిపాల్‌రెడ్డిని అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైనవారు 9492874006 నెంబరుకు సంప్రదించాలన్నారు. శిబిరంలో 33 మంది యువకులు రక్తదానం చేశారు.

అమ్మ ఆదర్శ బడుల పనులు వేగవంతం చేయాలి

కంగ్టి, ఏప్రిల్ 22: మండలంలోని అమ్మ ఆదర్శ బడుల పనులను వేగవంతం చేయాలని ఏపీడీ జగ్గారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కంగ్టి మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులు, సీసీలు, ఏపీఎంలతో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పునః ప్రారంభనాటికి అన్ని పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం అందేలా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, డీపీఎం మల్లేశం, సీసీలు రాజు, సంతోష్, ఎంఎస్ మహానంద తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపూర్‌లో బీజేపీ ఇంటింటి ప్రచారం

చేగుంట, ఏప్రిల్ 22: మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండలశాఖ అధ్యక్షులడు భూపాల్ మాట్లాడుతూ గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు తప్ప బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిలకమర్రి గోవింద్, మాజీ సర్పంచ్ నాగభూషణం, నాయకులు రవి, అంజి, భూపాల్, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'హామీలు మరిచిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి'

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 22: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరిట ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఎంపీ ఎన్నికలలో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల హక్కుల కోసం పోరాడుతుందన్నారు. మతం పేరుతో ప్రచారం చేస్తున్న బీజేపీకి ఓటు అడిగేహక్కులేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.

బీబీపాటిల్‌నామినేషన్‌కు తరలిన బీజేపీ నేతలు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 22: జహీరాబాద్‌పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా బీబీ పాటిల్ సంగారెడ్డిలో నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమానికి పెద్దశంకరంపేట మండలం బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో సోమవారం భారీగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. కార్యక్రమానికి తరలివెళ్లినవారిలో మాజీ సర్పంచులు, మండల బీజేపీ నాయకులు, ఆయా గ్రామాల నాయకులు తదితరులు ఉన్నారు.

జహీరాబాద్‌లో అప్రకటిత విద్యుత్‌కోతలు

జహీరాబాద్, ఏప్రిల్ 22: జహీరాబాద్ ప్రాంతంలో అప్రకటిత విద్యుత్ కోతలు విధించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు విద్యుత్ కోతలను విధించకూడదని ఆదేశిస్తున్నప్పటికీ జహీరాబాద్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో మాత్రం తరుచూ అంతరాయం తప్పడంలేదు. చిన్నపాటి జల్లులు కురిస్తే చాలు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. సాంకేతిక లోపంలో పైనుంచి సరఫరా పోయిందంటూ సంబంధిత అధికారులు బదులిస్తూ గంటల తరబడి సరఫరాను పునరుద్ధరించడంలేదు. దీంతో తాము నిత్యం ఇబ్బందులు పడుతున్నామని మహీంద్రాకాలనీ, పస్తాపూర్, మాచ్నూర్, రంజోల్, జహీరాబాద్, తదితర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన అమర్నాథ్

కోహీర్ ఏప్రిల్ 22: జడ్పీటీసీ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ నుంచి పోటీ చేసిన మనియార్‌పల్లి గ్రామానికి చెందిన అమర్నాథ్ సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జహీరాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ అమర్నాథ్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామలింగారెడ్డి తదితరులు ఉన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

జిన్నారం, ఏప్రిల్ 22: సోలక్‌పల్లిలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు. సోలక్‌పల్లిలో ఇటీవల మండలస్థాయి క్రికెట్ టోర్నమెంటు నిర్వహించగా, 18జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకుడు జగన్‌రెడ్డి తెలిపారు. పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో రాళ్లకత్వ, ఊట్ల గ్రామాల జట్లు నిలిచాయి. సోమవారం బీజేపీ జిల్లా నాయకుడు ప్రతాప్‌రెడ్డి, నాయకులు గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడి ఎన్నిక

రాయికోడ్, ఏప్రిల్ 22: బీఆర్ఎస్ పార్టీ మండల నూతన అధ్యక్షుడిని సోమవారం ఎన్నుకున్నారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ స్వగ్రామం పోతుల బొడలో మండల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఇందులో చేవేళ్ల విఠల్‌ను పార్టీ మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, వీరభద్రేశ్వరాలయ కమిటీ అధ్యక్షుడు సంగమేశ్వర్‌పాటిల్ ఉన్నారు.

'అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిని శిక్షించాలి'

రామాయంపేట, ఏప్రిల్ 22: రామాయంపేట మండలం వెంకటాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహం చూపుడువేలును ధ్వంసం చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని అంబేడ్కర్ సేవాసమితి రాష్ట్ర ఇన్‌చార్జి భూంపల్లి భీమ్‌రావ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన గ్రామంలో ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలించారు.

శోభాయమానం.. హనుమాన్ శోభాయాత్ర


మెదక్‌లో హనుమాన్ శోభ యాత్రలో పాల్గొన్న భక్తులు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 22: రామ లక్ష్మణ జానకీ.. జై బోలో హనుమాన్‌కీ అంటూ హనుమాన్ భక్తుల నినాదాలతో జిల్లా కేంద్రం మార్మోగింది. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం మెదక్ జిల్లా కేంద్రంలో వీర హనుమాన్ విజయయాత్ర కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక శ్రీ కోదండ రామాలయంలో నుంచి ప్రత్యేక వాహనంలో హనుమంతుడు, శ్రీరాముడి విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. శోభాయాత్ర నేపథ్యంలో ఏర్పాటు చేసిన తోరణాలతో పట్టణం కాషాయపు శోభను సంతరించుకున్నది. జిల్లా నలుమూలల నుంచి యువకులు, హనుమాన్ భక్తులు కాషాయ జెండాలు పట్టుకొని భజనలు, నృత్యాలు చేస్తూ శోభాయాత్రలో సందడి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించారు. ఈ యాత్రలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

వేడుకలకు ముస్తాబైన హనుమాన్ ఆలయం

నారాయణఖేడ్, ఏప్రిల్ 22: నారాయణఖేడ్ పట్టణంలోని కల్పనా హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహించడానికి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ నెల 23న హనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి అభిషేకం, చందనం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకుడు నర్సింహులు సోమవారం తెలిపారు.


బీరప్ప ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి దామోదర్

బీరప్ప ఆలయంలో మంత్రి పూజలు

రేగోడు, ఏప్రిల్ 22: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం మండలంలోని టి లింగంపల్లి బీరప్పస్వామి ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం మర్పల్లి గ్రామంలో పునర్ ప్రతిష్ఠాపన చేపట్టిన హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. మంత్రి వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దిగంబర్‌రావు, రాయికోడ్ టీపీసీసీ మెంబర్ మున్నూరు కిషన్, జడ్పీటీసీ యాదగిరి, మాజీ జడ్పీటీసీ రాజేందర్ పాటిల్ తదితరులు ఉన్నారు.

బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరికలు

మునిపల్లి, ఏప్రిల్ 22: మండలంలోని పెద్దపులారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు ఉపేందర్ ఆధ్వర్యంలో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బీబీపాటిల్ మాట్లాడుతూ బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తాను గత పదేళ్లలో ఎంపీగా జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి ఎంతగానో కృషి చేశానని గుర్తు చేశారు. ఈసారి గెలిపిస్తే ఈప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలన్నారు. బీజేపీలో చేరిన వారిలో కాంగ్రెస్ నాయకుడు పిల్లోడి విజయ్, బీఆర్ఎస్ నాయకులు బాశెట్టి సిద్దయ్య, మాజీ వార్డు మెంబర్ వీరన్న, అంబయ్య, వీరశెట్టి, అంజయ్య, హరీశ్, మొగులయ్య, శ్రీనివాస్, వెంకట్, ప్రకాశ్, మహేష్ ఉన్నారు.

● **నాగల్‌గిద్ద:** బీఆర్ఎస్ నాగల్‌గిద్ద మండల వైస్ ఎంపీపీ పండరియాదవ్ సోమవారం బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీపాటిల్ సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీరాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, పార్లమెంట్ కన్వీనర్ రవికుమార్, నాగల్‌గిద్ద జడ్పీటీసీ రాజురాథోడ్, నాయకులు పత్రి రామకృష్ణ, బస్వరాజ్, తదితరులు ఉన్నారు.


మునిపల్లి: బీజేపీలో చేరిన పెద్దపులారం నాయకులతో బీబీపాటిల్

● **కోహీర్:** మండలంలోని మనియార్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ జగన్నాథ్‌రెడ్డి సోమవారం బీజేపీలో చేరారు. ఆయనతో పాటు గ్రామానికి చెందిన మరో 50 మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీజేపీలో చేరిన జగన్నాథ్‌రెడ్డికి, పలువురికి జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు, బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు వైద్యనాథ్, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


పెద్దశంకరంపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 2: మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పెద్దశంకరంపేట తహసీల్దార్ గ్రేస్ బాయ్ సోమవారం ప్రారంభించారు. రైతులు జొన్నలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్, సీఈవో రవీందర్, ఏఈవో స్వాతి, ఆర్ఐ శరణప్ప, పీఏసీఎస్ సిబ్బంది ఉన్నారు.

● **నాగల్‌గిద్ద:** జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాగల్‌గిద్ద వెంకటేశం అన్నారు. సోమవారం మండలంలోని సక్రుతండాలో ఏఈవోలు సంతోష్, స్రవంతిలతో కలిసి ఆయన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో జొన్నలు విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మరు: సునితారెడ్డి


మాసాయిపేట: మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునితారెడ్డి

మాసాయిపేట, ఏప్రిల్ 22: సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ మరిన్ని మోసాలతో గెలవాలని చూస్తుందని, బీజేపీ తెలంగాణ ప్రజలకు చేసిందేమీ లేదని.. రెండు పార్టీలు బడేబాయ్ చోటే బాయ్‌లా కల్లబొల్లి హామీలతో గెలవాలని చూస్తున్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునితాలక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మాసాయిపేట మండల కేంద్రంలోని రామంతపూర్ తండా నుంచి బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం రామంతపూర్, రామంతపూర్ తండా, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత రెడ్డి మాట్లాడుతూ కేవలం నాలుగు నెలల్లోనే అధికార కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని నెరవేర్చలేక ప్రజాభిమానం కోల్పోయిందని, అలాగే బీజేపీని కూడా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఎమ్మెల్యే సునితారెడ్డి పేర్కొన్నారు. ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌నే గెలిపించుకుంటారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాసాయిపేట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చిన్నచౌదరి మధుసూదన్‌రెడ్డి, నాయకులు మన్సూర్, హరికృష్ణ, మాజీ సర్పంచ్ నాగరాజు, దుంపల శ్రీనివాస్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

కొల్చారం, ఏప్రిల్ 22: మండల పరిధిలోని పోతంశెట్‌పల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీపెద్దమ్మ తల్లి ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ పురోహితుడు కోలాచల శ్రీనివాసశర్మ, కృష్ణశర్మల చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు జరిపించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట కొల్చారం ఎంపీపీ మంజులా కాశీనాథ్, ఎంపీటీసీ సాయిని భాగ్యలక్ష్మి సిద్దిరాములు, మాజీ సర్పంచ్ నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం విద్యార్థులకు కంటి పరీక్షలు


విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 22: జాతీయ అంధత్వ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఎస్టీ వసతి గృహంలో వైద్యులు విద్యార్థులకు కంటిపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ సంతోషి మాట్లాడుతూ అంధత్వ నిర్మూలన కోసం రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్టీ వసతి గృహం వార్డెన్ సత్యనారాయణ, వైద్యులు వీర్‌కుమార్, సిద్ధిరాములు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ పర్యటన

తూప్రాన్, ఏప్రిల్ 22: పట్టణంలో సమస్యలను తెలుసుకునేందుకు సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ పర్యటించారు. పట్టణంలోని 1, 4, 12వ వార్డు హైదర్‌గూడ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను తక్షణం పరిష్కరించారు. చైర్‌పర్సన్ వెంట కౌన్సిలర్ రామునిగారి శ్రీశైలం గౌడ్, నాయకులు నర్సోజీ తదితరులు పాల్గొన్నారు.


మురుగు కాలువ పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం


ఉప్పర్‌పల్లి తండాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి చంద్రశేఖర్, నాయకులు

జహీరాబాద్, ఏప్రిల్ 22: సమష్టిగా పనిచేస్తు కాంగ్రెస్‌పార్టీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్‌కుమార్ షెట్కార్‌ను భారీమెజార్టీతో గెలిపించుకుందామని మాజీ మంత్రి డా. చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం మొగుడంపల్లిలో కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం ఉప్పర్‌పల్లితండా తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని గుర్తుచేశారు. ఎక్కడైనా కార్యకర్తల్లో స్వల్ప విబేధాలుంటే పక్కనబెట్టి పార్టీ పటిష్ఠానికి, అభ్యర్థి గెలుపుకోసం పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, మక్సూద్, కార్మికసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

నారాయణఖేడ్, ఏప్రిల్ 22: జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ ఈ నెల 24న సంగారెడ్డిలో నామినేషన్ సమర్పించనున్నందున నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.